
నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 11 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


మంత్రి సీతక్కతో కలిసి సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# 'టైగర్ కారిడార్'ను విరమించుకోవాలి

- జీవో 49ను వెంటనే రద్దు చేయాలి
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 10 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేయడాన్ని విరమించుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్క అధ్యక్షతన గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా గిరిజన ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆపై మంత్రి సీతక్క హామీతో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను విరమించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆదిలాబాద్-ఆసిఫాబాద్ జిల్లాలోని కవ్వాల్ పులుల అభయారణ్యం పరిధి ప్రాంతాలను కలుపుతూ ప్రభుత్వం విడుదల చేసిన 49 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టైగర్ కారిడార్ ఏర్పాటుతో అడవిని నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసుల బతుకులు ఆగమవుతాయన్నారు. టైగర్ కారిడార్ పేరుతో అడవిబిడ్డల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు రెగ్యులర్ ఆశ్రమ పాఠశాలను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని కోరారు. రాజీవ్ యువ వికాసంపై అవగాహన లేక అనేక మంది దరఖాస్తులు చేసుకోలేదని, మరోసారి అవకాశం కల్పించాలని ఆమె కోరారు.

# డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలు

- బీఆర్ఎస్ నాయకులతో పాటు స్థానికుల ఫిర్యాదు


డివిజన్ల రూపకల్పనపై అభ్యంతరాలను తెలుపుతూ వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్, జూన్ 10 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న డివిజన్లపై బీఆర్ఎస్ నాయకులతో పాటు స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి తమ అభ్యంతరాలను ఫిర్యాదు రూపంలో మేనేజర్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం మాట్లాడుతూ డివిజన్ల ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనల్లో 13, 38, 39,43,44,54 డివిజన్లలో భౌగోళికంగా మరోసారి సవరణలు చేయాల్సి ఉందని, వీటిలో మార్పులు చేస్తేనే రాబోయే ఎన్నికల్లో కార్పొరేటర్‌కు పనిచేయడానికి సులువుగా ఉంటుందని, అధికారులకు కూడా అభివృద్ధి పనులు చేపట్టడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. 42వ డివిజన్‌లో ఉన్న ఇంటి నంబర్ 19-490 నుంచి 500 వరకు ఉన్న నివాస గృహాలను 13వ డివిజన్‌లోకి మార్చాలని, 38వ డివిజన్‌లోని నాగదేవత కాలనీలో ఉన్న ఇంటి నంబర్ 23-215 నుంచి 225 వరకు ఉన్న ఇండ్లను 39లోకి మార్చాలని, 39 డివిజన్‌లోని శ్రీక్రిష్ణ కాలనీలోగల నివాసాలను 38లోకి మార్చాలని తెలిపారు. 43వ డివిజన్‌లో ఉన్న రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, ఐబీ ఏరియాలో పలు మార్పులు చేయాలని, 43 డివిజన్‌లో ఉన్న పలు నివాసాలను 44లో కలపాలని కోరారు. 54వ డివిజన్‌లోని గాంధీనగర్‌లోగల నివాసాలను 22వ డివిజన్‌లోకి, 22లో ఉన్న గోపాల్‌వాడను 54లోకి మార్చాలని తెలిపారు. బీజేపీ నాయకుడు జయరామారావు మాట్లాడుతూ 50వ డివిజన్‌లో ఉన్న 12-1 నుంచి 12-4 వరకు ఉన్న 109 మంది ఓటర్లను 49వ వార్డులోకి చేర్చాలన్నారు. హైటెక్‌కాలనీ 2 ఫేజ్‌లోని కేశవనగర్‌ను జాఫర్‌నగర్‌తో కలిసి 53వ డివిజన్‌లో కలిపారని, జాఫర్‌నగర్‌లోని కొన్ని ఇండ్లను హైటెక్ కాలనీలో కలిపారని, దీంతో డివిజన్ల హద్దులు చెల్లాచెదురుగా మారుతున్నాయని ముల్కల సత్యనారాయణ రెడ్డి, రమణారెడ్డి తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.



# గిరి బతుకులపై టైగర్ అస్త్రం

## ఆదివాసులను అడవులకు దూరం చేసే యత్నం

- నాడు కవ్వాల్ టైగర్ జోన్ పేరిట అన్యాయం
- నేడు ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా మారుస్తూ అనేక ఆంక్షలు
- 10 మండలాలు, 339 గ్రామాలను ప్రభావితం చేసేలా జీవో 49
- గిరిజనులను ఆగం పట్టిస్తున్న ప్రభుత్వం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : అడవులపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులను.. ఇక వాటికి దూరం చేసే యత్నం మొదలైంది. పులిని ఆరాధ్యదైవంగా భావించే గిరిజనులను.. ఆ పులి పేరిటే అస్త్రం ప్రయోగించి బయటకు పంపే కుట్ర జరుగుతున్నది. నాడు కవ్వాల్ టైగర్ జోన్ పేరిట అనేక మంది అడవిబిడ్డలకు అన్యాయం చేసిన కాంగ్రెస్.. నేడు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేసి వారి బతుకులను మరోసారి ఆగం చేసే పాపానికి ఒడిగడుతున్నది.

### నాడు కవ్వాల్ టైగర్‌జోన్ పేరిట..

కవ్వాల్ టైగర్ జోన్ పేరుతో 2012 ఏప్రిల్ 10న జీవో ఎస్27ను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసింది. కవ్వాల్ అడవుల్లో ఒక్కపులి లేకపోయినా జీవో 27ను తీసుకొచ్చి 892 చదరపు కిలోమీటర్ల పరిధిలో కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేసింది. దీంతో జన్నారం, ఆదిలాబాద్, బెల్లంపల్లి, ఉట్నూర్ అడవి డివిజన్‌లలోని తాళ్లపేట్, జన్నారం, ఇందన్‌పల్లి, బీర్సాయిపేట్, కడెం, పెంబి అటవీ రేంజ్‌ల పరిధిలోని గిరిజనులను అడవుల నుంచి వెళ్ల గొట్టే ప్రయత్నాలు జరిగాయి. కడెం పరిధిలోని గండిరాంపూర్, మైసంపేట్ గ్రామాల్లోని గిరిజనులను ఖాళీ చేయించారు. జన్నారం పరిధిలోని మల్యాల, దొంగపల్లి, అల్లీనగర్ గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నాలు చేశారు. అయితే, కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పడి 13 ఏళ్లయినా ఒక్క పులి కూడా నివాసం ఏర్పర్చుకోక పోవడంతో గ్రామాలను ఖాళీ చేయించే ప్రక్రియ వాయిదా పడింది. పులి కనిపించకపోయినా ఇంకా ఈ గ్రామాలను ఖాళీచేసే కుట్రలు మాత్రం సాగుతున్నాయి. కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేసి దాదాపు 13 ఏళ్లు గడిచినా ఇంతవరకు ఒక్క పులికూడా నివాసం ఏర్పాటు చేసుకోలేదు. కావ్వాల్ అడవుల్లోకి మూడు నాలుగుసార్లు చుట్టపు చూపుగా పులి వచ్చి వెళ్లిపోయింది.

### నేడు టైగర్ కారిడార్ పేరిట..

తాజాగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా మార్చింది. టైగర్ కన్జర్వేషన్ పేరుతో జిల్లాలోని 339 గ్రామాలను ప్రభావితం చేసేలా జీవోను 49ను విడుదల చేసింది. 1492.22 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నది. కవ్వాల్ టైగర్ జోన్ పరిధి 892 చదరపు కిలోమీటర్లలో ఉంటే.. కాగజ్‌నగర్ కారిడార్ కన్జర్వేషన్ పరిధి 1492.22 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉంది. మహారాష్ట్రలోని తడోబా- అంధేరి, కన్నెరాం, తిప్పేశ్వర్, చప్రాల ప్రాంతాల్లోని టైగర్ రిజర్వులతో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వులను తెలంగాణలోని కవ్వాల్ టైగర్‌జోన్‌కు అనుసంధానం చేస్తూ కాగజ్‌నగర్ కారిడార్‌ను కీలకంగా మారుస్తూ జీవో 49ను ప్రత్యేకంగా ప్రభుత్వం విడుదల చేసింది. గతేడాది నుంచే ఈ కారిడార్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం.. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులపై ఆంక్షలు అమలు చేస్తూ వస్తోంది. అటవీ భూములను సాగుచేయకుండా, బోర్లు వేయకుండా అడ్డుకుంటున్నది. మరోవైపు గ్రామాల్లో పక్కా ఇండ్లు కూడా నిర్మించకుండా చేస్తున్నది. ఇప్పుడు ఏకంగా జీవో 4ను విడుదల చేయడంతో అటవీ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టని పరిస్థితి నెలకొంది.

### 10 మండలాల్లో జీవో 49 ప్రభావం...

టైగర్ కన్జర్వేషన్ పేరుతో విడుదల చేసిన జీవో 49.. జిల్లాలోని 10 మండలాలపై ప్రభావం చూపనున్నది. కాగజ్‌నగర్ డివిజన్‌లోని సిర్పూర్-టీ, కౌటాల, బెజ్జూర్, కాగజ్‌నగర్, దహెగాంతో పాటు ఆసిఫాబాద్ డివిజన్‌లోని తిర్యాణి, ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాలపై ఈ జీవో ప్రభావం ఉంటుంది. దహెగాం, గూడెం, బెజ్జూర్, కదంబ, గిరెల్లి, గార్లపేట్, ఆగ, మానిఘట్ గ్రామాలను మొదట టార్గెట్ చేస్తున్న అటవీ అధికారులు.. ఆ గ్రామాల్లో టైగర్ కారిడార్ అంక్షలను మొదట అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులు తమ భూములను వదిలివేయడంతోపాటు పులులు సంచరించే గ్రామాలను కూడా ఖాళీ చేయాల్సి ఉంటుంది. 2012లో కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేసిన సమయంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే.. ప్రస్తుతం టైగర్ కారిడార్ ఏర్పాటు చేస్తున్న సమయంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే కావడం గమనార్హం. అటవీ గ్రామాల్లో తరతరాలుగా జీవిస్తున్న తమపై పులులు సంరక్షణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆగంపట్టిస్తున్నదంటూ అడవిబిడ్డలు మండిపడుతున్నారు.



# వన్యప్రాణుల రక్షణకు కృషి చేయాలి

- మంచిర్యాల కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఎఫ్‌డీపీటీ శాంతారాం
- శిక్షణ తరగతుల ముగింపు.. సర్టిఫికెట్ల అందజేత

సీసీసీ నస్పూర్, జూన్ 10 : వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంచిర్యాల కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్(ఎఫ్‌డీపీటీ) శాంతారాం సూచించారు. సీసీసీలోని సింగరేణి అతిథి గృహంలో మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వన్యప్రాణుల సంరక్షణ, పునరావాసం కల్పించడంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 మంది అటవీ శాఖ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించగా, ఎఫ్‌డీపీటీ శాంతారాం హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవికి అందానిచ్చే వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇందులో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ అధికారి రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఎఫ్‌డీపీటీ శాంతారాం

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- మంచిర్యాల కార్పొరేషన్ ఎదుట ధర్నా
- మేనేజర్‌కు వినతి

# నస్పూర్ ఏరియా సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్, జూన్ 10 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నస్పూరు ఏరియాలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నస్పూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గతంలో నస్పూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న 121 మంది పారిశుధ్య కార్మికులను తొలగించారని, వాళ్లందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. నస్పూరు మున్సిపాలిటీలో 41 ట్రాలీలు ఉండేవని, వాటిలో చాలా వరకు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయని, వాటి డ్రైవర్లను కూడా విధుల్లోకి తీసుకొని ట్రాలీలను నడిపించాలని కోరారు. నస్పూరు ఏరియాలో ఎల్ఈడీ వీధి దీపాలు వెలగడం లేదని, చిన్నచిన్న మరమ్మతులు చేస్తే అవి అందుబాటులోకి వస్తాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అధికారపార్టీకి సంబంధించిన నాయకులు వారికి అనుకూలమైన వారికే ఇచ్చారని, అనర్హులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ అమృత్ పథకం కింద వాటర్ ట్యాంకులు నిర్మించడం కోసం పెద్ద ఎత్తున మట్టి తీశారని, ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో పెద్దపెద్ద బొందలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని, వాటి చుట్టూ కంచె వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అక్కూరి సుబ్బయ్య, బేర సత్యనారాయణ, వంగ తిరుపతి, మేరుగు పవన్‌కుమార్, పంబాల గంగ, కుర్మిళ్ల అన్నపూర్ణ, గరిశె రామస్వామి, అహ్మద్, కే సురేందర్‌రెడ్డి, పానుగంటి సత్తయ్య, ఎం రాజేంద్రపాణి తదితరులు పాల్గొన్నారు.


మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## సేవలు మీవి.. ఫ్యాన్లు మావే..!



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ వార్డుల్లో ఫ్యాన్లు సరిగా పనిచేయక గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. రెండు బెడ్‌లకు కలిపి ఒక ఫ్యాన్ ఉండడం.. అది కూడా అంతంత మాత్రంగానే తిరుగుతండడంతో తల్లీబిడ్డలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక చేసేదేమీ లేక కొందరు ఇంటి నుంచి ఫ్యాన్లు.. కూలర్లు తెచ్చుకుంటుండగా, మరికొందరు కొనుక్కొని వచ్చి మరీ తమ బెడ్‌ల వద్ద ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంకొందరైతే చేసేదేమీ లేక వెళ్లదీస్తున్నారు. పేరుకు పెద్దాసుపత్రి అయినా.. సౌకర్యాలు లేకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందిస్తారో.. లేదో మరి.. - నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మంచిర్యాల

# డీసీఎంఎస్ నిర్వాహకుడి ఇంటిపై విజిలెన్స్ దాడులు

పెంచికల్‌పేట్, జూన్ 10 : పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి చెందిన డీసీఎంఎస్ నిర్వాహకుడు గణపురం రాజ్‌కుమార్ ఇంటిపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతుల్లేకుండా పత్తి విత్తనాలు అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు అధికారులు రాజ్‌కుమార్ ఇంటిలో తనిఖీలు చేశారు. భారీగా పత్తి విత్తనాలు పట్టుకొని మండల వ్యవసాయ అధికారిని మనీషాకు అప్పగించారు. ఈ విషయమై ఏవో మనీషాను వివరణ కోరగా.. విచారణ కొనసాగుతున్నదని.. పట్టుబడ్డ పత్తి విత్తనాలను సీజ్ సదరు వ్యక్తికి నోటీసు అందించామని, బుధవారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# వనరులను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్
- కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో సమీక్ష


మాట్లాడుతున కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 10 : జిల్లాలోని సాగు, తాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి నీటిపారుదల, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సాగునీటి వనరుల రక్షణ, నీటి వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఊరూరా శుద్ధజలం అందించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ నీటిపారుదల ప్రాజెక్టు, 3 మధ్య తరహా ప్రాజెక్టులు, 574 చెరువులు, కుంటలు, 13 లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతకుముందు కేంద్ర బృందం గుండి గ్రామాన్ని సందర్శించి ఇండ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు, నీటిపారుదల శాఖ అధికారులు గుణవంత రావు, ప్రభాకర్, మిషన్ భగీరథ అధికారి సిద్ధిఖి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.